



వైభవంగా కార్తీక పౌర్ణమి

- శివుడికి అభిషేకాలు
- ఆలయాల ముందు జ్వాలా తోరణాలు



జి.సిగడాం: ఎందువ కైలాసేశ్వర ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ చేస్తున్న వేలాది మంది భక్తులు

పలాస: ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలా తోరణం



ఇచ్ఛాపురం: వీకేపేట జంక్షన్‌లోని ఆంజనేయ విగ్రహం వద్ద వెలిగించిన దీపాలు

జిల్లా ప్రజలు బుధవారం కార్తీక పౌర్ణమిని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వేకువజామునే స్నానాలు ఆచరించి నీటిలో దీపాలు వదిలారు. శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజుకావడంతో భక్తులు అధిక సంఖ్యలో శివాలయాలకు వెళ్లి దర్శనం చేసుకున్నారు. అర్చనలు, అభిషేకాలు చేశారు. మహిళలు ఉదయం నుంచి ఉపవాస దీక్షలు చేశారు. పలువురు నోములు నోచారు. వాయనాలు ఇచ్చారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. దీపోత్సవం, జ్వాలా తోరణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

-ఆంధ్రజ్యోతి బృందం



శ్రీకాకుళంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శ్రీకాకుళంలో బాలాత్రిపుర సుందరిదేవీ ఆలయం వద్ద జ్వాలా తోరణం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు
- వ్యవసాయ శాఖ జేడీ తీరుపై రవికుమార్ ఆగ్రహం
- ఎంఎస్ఎంఈల అభివృద్ధిపై ఎమ్మెల్యేల అసంతృప్తి
- వాడీవేడిగా జిల్లా సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, చిత్రంలో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, శ్రీనివాస్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం/కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి డీఆర్సీ సమావేశం నిర్వహించారు. వ్యవసాయం, దాని అనుబంధ శాఖలు, పరిశ్రమల శాఖ, పింఛన్లు, ఎన్ఆర్ఈజీఎస్, ఆరోగ్యశాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ, శానిటేషన్, మెడికల్ అండ్ హెల్త్ శాఖలపై వాడీవేడిగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. ఇటీవల మొంథా తుఫాన్‌తో నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఇప్పటికే అధికారులు పంట నష్టం వివరాలను నమోదు చేస్తున్నారని వివరించారు. ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని చెప్పారు. పలాసలో కిడ్నీ ఆసుపత్రిలో రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని వైద్యులను ఆదేశించారు. మత్స్యకార తీర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. గత ప్రభుత్వం (మిగతా 6వ పేజీలో..)

- ఎన్ఆర్ఈజీఎస్ బిల్లుల చెల్లింపుల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు భరోసా ఇచ్చారు. పూర్తయిన పనులకు కూడా బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యాలను చేరుకునేలా శ్రీకాకుళాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు.



సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం

- జిల్లాలో 406 కేంద్రాలు ఏర్పాటు
- 6.50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- నచ్చిన చోట అమ్ముకోవచ్చు
- సంచులు కూడా ఇవ్వనున్న ప్రభుత్వం
- అన్‌లోడింగ్‌కు ఎలాంటి చార్జీలు లేవు
- 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాకు నగదు



నరసన్నపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది 406 కొనుగోలు కేంద్రాల ద్వారా 6.50 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటిలో 3.58 లక్షల మెట్రిక్ టన్నులు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ)కు, మిగతా ధాన్యం సివిల్ సప్లయ్‌కు కేటాయించనున్నారు. సోమవారం నుంచి అధికారికంగా కొనుగోలు ప్రక్రియను ప్రారంభించినా, ఈనెల 11 నుంచి 614 రైతు సేవా కేంద్రాలు(ఆర్ఎస్‌కే) షెడ్యూల్ ఇచ్చి ధాన్యం కొనుగోలును ముమ్మరం చేయనున్నారు. మరొక వైపు మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలని మిల్లర్లకు ఆదేశాలు జారీ చేశారు. బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చిన మిల్లులకే ప్రభుత్వం ధాన్యం సరఫరా చేయనుంది. సాంకేతిక పరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు సివిల్‌సప్లయ్ శాఖ ఆధ్వర్యంలో సాంకేతిక నిపుణులు మండల స్థాయిలో ఏజెన్సీలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, వీఏవోలు, వీఆర్వోలు, డేటా ఆపరేటింగ్ సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఆర్ఎస్‌కే, పీఏసీఎస్, ఎఫ్‌పీవో, డీసీఎంఎస్, డ్వాక్రా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నారు.

రెండు రోజుల్లోనే నగదు జమ..

గత ఏడాది మాదిరిగానే ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నగదును జమచేయనుంది. ధాన్యం విక్రయించే విషయంలో నిబంధనలు సులభతరం చేసింది. రైతులు తమకు నచ్చిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చును. రైతు సేవా కేంద్రాలకు సమాచారం ఇస్తే.. షెడ్యూల్ ఇస్తారు. షెడ్యూల్ ఇచ్చిన తరువాత ధాన్యం శాంపిల్స్‌ను సాంకేతిక నిపుణులు సేకరించి శాస్త్రీయ పద్ధతిలో తేమ, పొల్లు మొదలగు నాణ్యత ప్రమాణాలను పరిశీలిస్తారు. నాణ్యత తక్కువగా ఉంటే రైతులకు ధాన్యం బాగు చేసేందుకు అవకాశం ఇస్తారు. తరువాత జియోట్యాగింగ్ కలిగిన వాహనాలతో (మిగతా 6వ పేజీలో..)

3.80 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 3.80 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. గతేడాది సన్న రకాలను విక్రయించేందుకు ఇబ్బందులు ఏర్పడడంతో ఈ ఏడాది దాదాపు 85శాతం సాధారణ రకాలే సాగు చేసారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది వరికి మద్దతు ధర పెంచింది. క్వింటా సాధారణ రకం రూ.2,369, గ్రేడ్-1 రకం రూ.2,389గా నిర్ణయించింది. జిల్లాలో రైతులు 80 కేజీల చొప్పున సంచుల్లో ప్యాకింగ్ చేసి విక్రయిస్తారు. దీని ప్రకారం సాధారణ రకం 80కేజీల బస్తా రూ.1,895, గ్రేడ్ -1 రకం రూ.1,911 ధర పలకనుంది.

కుక్కలు దాడి.. 20 మేక పిల్లల మృతి




మృతి చెందిన మేక పిల్లలు

సరుబుజ్జిలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసకలపాలెం గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో 20 మేక పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కొయ్యాన ఎర్రయ్య సుమారు వంద మేకలను మేపుకొంటూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం రాత్రి మేక పిల్లలను పాకలో పెట్టి తడిక వేశాడు. బుధవారం తెల్లవారుజామున మూడున్నర గంటల సమయంలో ఎనిమిది కుక్కలు మేక పిల్లలపై దాడిచేసి కొరికేశాయి. దీంతో 20 మేక పిల్లలు మృతి చెందాయి. సుమారు రూ.3లక్షల నష్టం జరిగిందని ఎర్రయ్య రోదిస్తున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు. చనిపోయిన మేకలను పెద్దసవలాపురం సచివాలయ పశువైద్య అసిస్టెంట్ పరిశీలించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకొని వెళ్తామని సర్పంచ్ పల్లి సురేష్, ఉప సర్పంచ్ జగదీశ్వరరావు, టీడీపీ నాయకుడు కొబగాపు జనార్దనరావు తెలిపారు.

'జూదం నిషేధం'

ప్లకార్డులు పట్టుకోవాలి



- గేమింగ్ యాక్ట్ కేసు నిందితులకు కోర్టు తీర్పు
- నేటి నుంచి పది రోజులు అమలు
- తీర్పు ఉల్లంఘిస్తే నెల రోజుల జైలుశిక్ష

శ్రీకాకుళం క్రైమ్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జూదం కేసు నిందితులకు కోర్టు వినూత్నమైన శిక్ష విధించింది. శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం శ్రీకాకుళం నగరం పరిధిలో ఐదుగురు జూదం ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులు వారిని ఏపీ గేమింగ్ యాక్ట్ కింద అరెస్టు చేసి బుధవారం శ్రీకాకుళం రెండో తరగతి మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించడంతో పాటు పది రోజుల పాటు ప్రజలకు అవగాహన కల్పించేలా ప్లకార్డులు ప్రదర్శించాలని న్యాయాధికారి తీర్పునిచ్చారు. ఈనెల 6 నుంచి 15వ తేదీ వరకు నగరంలోని ప్రధాన జంక్షన్ల వద్ద 'జూదం నిషేధం'.. 'బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధం' అని తెలిపేలా ప్లకార్డులు ప్రదర్శించాలని తీర్పు వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి 11 వరకు.. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 వరకు ఈ ప్లకార్డులతో ప్రజలకు అవగాహన కల్పించాలని, కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే నెల రోజుల జైలు శిక్ష విధిస్తామని పేర్కొన్నారు.

కొన్నిచోట్లే సోలార్ కాంతులు

- జిల్లాలో 'సూర్యఘర్'కు ఆదరణ అంతంతే
- ఆసక్తి చూపని వినియోగదారులు
- ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ సన్నాహాలు



ఇచ్ఛాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సూర్యఘర్ పథకానికి ఆశించిన స్థాయిలో ఆదరణ దక్కడం లేదు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితం, మహిళా సంఘ సభ్యులకు ప్రాధాన్యం ఇచ్చినా ఫలితం ఉండడం లేదు. డాబాలు లేకపోయినా.. ఖాళీ స్థలాల్లో సోలార్ పలకల ఏర్పాటుకు అవకాశమిచ్చినా ప్రజలు ముందుకు రావడం లేదు. సూర్యఘర్ రిజిస్ట్రేషన్లు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులను ఆహ్వానించాలని విద్యుత్ శాఖ చూస్తోంది. నియోజకవర్గాల వారీగా కౌంటర్లు పెట్టి వీలైనంత వరకూ ఎక్కువ యూనిట్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సైతం తగ్గించిన నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రణాళిక వేస్తోంది.

జిల్లాలో పరిస్థితి..

కేంద్ర ప్రభుత్వం పీఎం సుర్యఘర్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో గత ఏడాదిన్నర కాలంలో 2,930 మంది మాత్రమే ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వం సరిగ్గా ముందుకు తీసుకెళ్లలేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. పేద, మధ్యతరగతి వర్గాలకు విద్యుత్ బిల్లుల భారం నుంచి తప్పించుకునేందుకు సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవాలని పెద్ద ఎత్తున అవగాహన కల్పించింది. సూర్యాఘర్ పథకంలో భాగంగా మూడు కిలోవాట్లకు సంబంధించి రూ.78వేల వరకూ సాయం అందించనుంది. ఈ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే ఇంటి అవసరాలకు పోను విద్యుత్ మిగిలి ఉంటే అమ్ముకోవచ్చు. డిస్కంలే కొనుగోలు చేసి ఆ నగదును (మిగతా 6వ పేజీలో..)

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- కళ్లేపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

శ్రీకాకుళం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతుందని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. కళ్లేపల్లి గ్రామంలో రూ.2.60 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళ్లేపల్లి పీహెచ్‌సీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత రోజుల్లో వైద్యం చాలా ఖరీదుగా మారిందన్నారు. అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తే బిల్లులు కట్టేందుకు ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. అందుకే ప్రభుత్వం వైద్య రంగంపై (మిగతా 6వ పేజీలో..)



పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న దృశ్యం

కేజీబీవీలపై సోలార్ ఏర్పాటు తప్పనిసరి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్
7లో

రాష్ట్రస్థాయి క్రికెట్ విజేత 'విశాఖ'
- ద్వితీయస్థానంలో శ్రీకాకుళం

రూ.250 కోట్లతో 69 సబ్ స్టేషన్లు
- మంత్రి గొట్టిపాటి
7లో


టెక్కలి: కార్తీక దీపాల కాంతుల్లో వంశధార కాలువ


సోంపేట: బారువ బీచ్‌లో తెప్పలు వదులుతున్న భక్తులు

కార్తీక పున్నమి వేళలో..

● భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు

● జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక సందడి

కార్తీక పౌర్ణమి పూజలు బుధవారం జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరిగాయి. వేకువ జామునే భక్తులు నదులు, కాలువలు, చెరువుల్లో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగించి తెప్పలు వదిలారు. అనంతరం సమీప ఆలయాల్లో పూజలు చేశారు. ఆయా ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం


టెక్కలి: అలంకరణలో పట్టుమహాదేవి కోనేరు గట్టుపై గల రామలింగేశ్వరస్వామి


కవిటి: పుక్కళ్లపాలెం సముద్ర తీరంలో భక్తుల సందడి


శ్రీకాకుళం: కాలభైరవ ఆలయం వద్ద..


జలుమూరు: శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

భక్తజన సిరి.. కైలాస గిరి

● ఎందువ గిరి ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు

● బందోబస్తు, వైద్య శిబిరాలు ఏర్పాటు

జి.సిగడాం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎందువ గ్రామ సమీపంలో గల కైలాసేశ్వర ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. కైలాస గిరి ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప, శివ మాలాధారణ చేసిన భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బుధవారం ఉదయం 5 గంటలకు కైలాసేశ్వర ఆలయ ప్రాంగణం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమై నడిమివలస, శేతుభీమవరం, గెడ్డకంచరాం మీదుగా దాదాపు ఐదు వేల మంది భక్తులు 12 కిలోమీటర్ల మేర కాలినడకన తిరిగి ఆలయానికి చేరుకున్నారు. దారిపొడవునా మంచినీళ్లు, మజ్జిగ, స్నాక్స్ ఆయా ప్రాంతవాసులు అందించారు. పలు కూడళ్ల వద్ద జి.సిగడాం, బాతువ పీహెచ్‌సీ వైద్యాధికారులు యశ్వంత్, అనూష, ప్రతిష్టా శర్మ, సుమబిందు ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సుమారు 60 మంది పోలీసుతో బందోబస్తు చేపట్టారు. డీఎల్‌పీవో గోపీ బాల, తహసీల్దార్ ఎం.సరిత, ఎంపీడీవో రామకృష్ణ, సీఐ అవతారం, ఎస్ఐ వై.మధుసూదనరావు, ఏపీవో సత్యనారాయణ పర్యవేక్షించారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

ఎందువ కైలాసగిరిని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. బుధవారం గిరి ప్రదక్షిణలో పాల్గొని నవదుర్గాదేవి సహిత రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కైలాసగిరిపై నిర్మించిన 21 అడుగుల గౌరీశంకరులు విగ్రహాలను ఆవిష్కరించారు. తాగునీటి బోర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు జోగినాయుడు, కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, బెవర జగన్నాథరావు, వజ్జపర్తి రఘురాం తదితరులు పాల్గొన్నారు.


స్వామివారికి అభిషేకం చేస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఎన్ఈఆర్


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు


స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన వివిధ రకాల పిండి వంటకాలు

64 రకాల పిండివంటలతో..

టెక్కలి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా టెక్కలిలోని చిన్నబ్రాహ్మణవీధిలో గల రాధాకాంత మఠంలో స్వామివారికి 64రకాల వంటకాలతో నైవేద్యాలు పెట్టారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మదన్‌గోపాల్, దాస్‌జీ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.


నందిగాం: మేలుకొలుపులో పాల్గొన్న శివ భక్తులు


శ్రీకాకుళం: అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు


సోంపేట రూరల్: ఎకుపూరు ఉప్పుటేరు వద్ద..


పాతపట్నం: బోరుభద్రలో మేలుకొలుపు భజనలు


జలుమూరు: శ్రీముఖలింగేశ్వరాలయ గోపురంపై వెలిగించిన శిఖరాగ్ర దీపం


ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం వద్ద..


ఇచ్ఛాపురం: బాహుదానదిలో శివుని విగ్రహం వద్ద..

జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

(5వ పేజీ తరువాయి)

తొలగించిన వితంతు పింఛన్లను పునరుద్ధరించామన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో కొత్తగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో వంద శాతం ఈక్రాప్ నమోదైందని, దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ కూడా అందుబాటులోకి తీసుకువచ్చిందని వివరించారు.

అంకిత భావంతో పనిచేస్తున్నాం: మంత్రి కొండపల్లి

జిల్లాను అభివృద్ధి బాటలో నడిపించేందుకు అంకితభావంతో కృషి చేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఉపాధి కల్పన, పరిశ్రమలు, పారిశుధ్యం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ పార్కులు) మౌలిక వసతులను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.600కోట్ల వ్యయంతో పీఎంఈజీపీ, సీఎంఈజీపీ కార్యక్రమాల ద్వారా ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతీ ఆరు నెలలకోసారి నియోజకవర్గాల వారీగా సమీక్ష నిర్వహించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలో చెరకు సాగు తగ్గుతోందని, ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.

సమాచారం కూడా లేకుండా ఎలా వస్తారు?: రవికుమార్

వ్యవసాయ శాఖ జేడీ పనితీరుపై ఆమదాలవలస ఎమ్మెల్యే, పీయుసీ ఛైర్మన్ కూన రవికుమార్ నిప్పులు చెరిగారు. జిల్లా సమీక్ష సమావేశానికి కనీస సమాచారం కూడా తీసుకురాకుండా ఎలా వస్తారని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకానికి సంబంధించి 47వేలమంది రైతులు జిల్లా సమాచారంలో తక్కువగా ఉన్నారని అన్నారు. ఇంత నిర్లక్ష్యంగా ఎలా పనిచేస్తారని నిలదీశారు. ఆమదాలవలస సుగర్ ఫ్యాక్టరీకి 250 కోట్ల విలువైన 75 ఎకరాల భూమి ఉంది. ఏపీఐఐసీ ద్వారా దీనిని అభివృద్ధి చేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు.

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. శ్రీకాకుళం ఎంఎస్ఎంఈ పార్కులో భాగంగా ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లో గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే పెడుతున్నారని.. మరో రెండు ఫ్లోర్లు నిర్మించుకునే అవకాశాల్ని కూడా పరిశీలించాలని కోరారు.

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామస్థాయి సచివాలయ సిబ్బందిని సంబంధిత ఎమ్మెల్యేల దృష్టిలో పెట్టకుండా వారిని ఓడీ డెప్యుటేషన్‌పై మరొక చోట వేస్తున్నారని, దీనివల్ల సేవలకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ... ఉద్దానంలో కిడ్నీ వ్యాధులపై మరోమారు సర్వే జరిపించాలని కోరారు. అత్యవసరంగా కిడ్నీ ఆసుపత్రి కోసం ప్రత్యేకంగా ఉద్దానం ప్రాజెక్టు నుంచి పైపులైన్ వేసి నీరు అందించాలని కోరారు.

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం పనుల కింద రోడ్లు వేయడానికి అనుమతుల పెండింగ్ ఉన్నాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

● మెళియాపుట్టి, పలాస మండలం, రామకృష్ణాపురం, ఎచ్చెర్ల మండలంలో ఎంఎస్ఎంఈ అభివృద్ధిలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని, గత ఆరు నెలలుగా అధికారులు ఆ వైపు కూడా చూడడం లేదని పలువురు ఎమ్మెల్యేలు విమర్శించారు. పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నారని, కనీసం రోడ్లు అయినా వేస్తే వారు ముందుకు వస్తారన్నారు. అలాగే ప్రతీ ఎంఎస్ఎంఈ వద్ద ఒక 33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ సమీక్షలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసనాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీసీఎంఎస్ ఛైర్మన్ చౌదరి అవినాష్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొన్నిచోట్లే సోలార్ కాంతులు

(5వ పేజీ తరువాయి)

లబ్ధిదారుడికి అందిస్తాయి. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అయినా వినియోగదారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

మిగులు విద్యుత్ అమ్ముకోవచ్చు..

ఒకసారి సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే 25 సంవత్సరాల పాటు నిరంతరాయంగా వాడుకోవచ్చు. ఒక కిలో వాట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు రూ.90 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు ఖర్చవుతుంది. దీనికి రూ.30 వేల వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. రెండు కిలోవాట్ల ప్లాంట్ అయితే రూ.లక్ష నుంచి రూ.1.45 లక్షల ఖర్చు అవుతుంది. రూ.60 వేల వరకు సబ్సిడీ అందిస్తారు. మూడు కిలోవాట్లు అయితే రూ.1.80 లక్షల నుంచి రూ.2.20 లక్షల ఖర్చు అవుతుంది. రూ.90 వేల వరకు రాయితీ పొందవచ్చు. ఇంటి అవసరాలకు విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే.. చాలా వరకూ మిగలనుంది. దానిని డిస్కంలకు అమ్ముకోవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి..

సూర్యఘర్‌పై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నా ప్రజల నుంచి పెద్దగా స్పందన రావడం లేదు. ఇంటిపైన, ప్రాంగణాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికి రాయితీ సైతం అందిస్తాం. మిగులు విద్యుత్‌ను సైతం డిస్కంలు కొనుగోలు చేస్తాయి. ఇది మేలైన పథకం. వినియోగాదారులు సద్వినియోగం చేసుకోవాలి.

- కృష్ణమూర్తి, విద్యుత్ శాఖ ఎస్ఈ, శ్రీకాకుళం

సినీ పరిశ్రమలో సిక్కోలు కుర్రోడు

● చంటి దర్శకత్వంలో 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో'

● రేపు ప్రపంచ వ్యాప్తంగా 200 థియేటర్లలో రిలీజ్

రణస్థలం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం లింగాలవలసకు చెందిన లుకలాపు రాహుల్ (చంటి) సిని పరిశ్రమలో అడుగు పెట్టాడు. సహాయ దర్శ కుడిగానే కొనసాగుతూ నైపుణ్యాన్ని పెంపొందించు కుని పదేళ్ల తరువాత సినిమా దర్శకుడిగా అవకాశం దక్కించుకున్నాడు చంటి. ఈయన దర్శకత్వంలో రూపొందిన 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' సినిమా ప్రపంచ వ్యాప్తంగా 200 థియేటర్లలో ఈనెల 7న విడుదల కానుంది.


ప్రీ వెడ్డింగ్ షో చిత్ర దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్న రాహుల్

సాధారణ కుటుంబం నుంచి వచ్చి..

రాహుల్ లుకలాపు తల్లిదండ్రులు అప్పలనాయుడు, ఇందిర సాధారణ రైతులు. విజయనగరం, శ్రీకాకుళంలో ప్రాథమిక విద్య పూర్తి చేసిన రాహుల్, బీటెక్ పూర్తి చేశాడు. సినిమాలంటే ఇష్టం పెంచుకున్న రాహుల్ సినిమా మేకింగ్‌కు అవసరమైన అంశాలను ఇంజనీరింగ్ చదువుతుండగానే తెలుసుకున్నాడు. యూట్యూబ్ చానల్‌లో పనిచేసి వెబ్‌సిరీస్‌కు దర్శకత్వం వహించాడు. ఆ తరువాత పలువురు చిన్న దర్శకుల వద్ద అసిస్టెంట్‌గా చేరాడు. ఇటీవల ప్రీ వెడ్డింగ్ షూట్ మాటున అనేక రకాల ఘటనలు జరుగుతున్నాయి. అందులో కామెడీ జోనర్‌ను ఎంచుకుంటూ కథ తయారు చేసుకుని చిత్రాన్ని రూపొందించాడు.

ఆదమరిస్తే అంతే..

● మాకన్నపల్లి రోడ్డులో పొంచివున్న ప్రమాదం

పలాస రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి పలాస మండలం మాకనపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో కల్వర్టు వద్ద ఏర్పడిన రంధ్రం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆ ప్రదేశంలో వాహన చోదకులు ఏమాత్రం ఆదమరచినా ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డులో సుమారు ఐదు ప్రధాన గ్రామాలు ఉండడంతో అధిక సంఖ్యలో ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా ఉదయం పూట విద్యార్థులు, మహిళలు ఆటోలపై ప్రయాణం చేస్తుంటారు. కల్వర్టు వద్ద రంధ్రం కావడంతో కేవలం ఓ రేకు డబ్బాను పెట్టి ప్రమాదకరమనే సంకేతాన్ని ఇచ్చారు. మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ ప్రాంతంలో ప్రమాదాలు అధికమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు రంధ్రం వద్ద మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని వాహన చోదకులు కోరుతున్నారు.


కల్వర్టు రంధ్రం వద్ద ఏర్పాటు చేసిన డబ్బా

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

మిల్లులకు తరలిస్తారు. జిల్లాలో 5,135 వాహనాలకు జియోట్యాగింగ్ చేశారు. అక్కడ కస్టోడియన్ అధికారిగా ఉన్న వీఆర్వో ధాన్యం తీసుకొని బిల్లులు చెల్లింపునకు సిఫారసు చేస్తారు. హమాలీ (కళాసీ) చార్జీలు, రవాణ చార్జీలు రైతుల ఖాతాల్లో వారం రోజుల్లో జమకానున్నాయి. హమాలీ చార్జీలు క్వింటాకు రూ.17.17, రవాణా చార్జీలు 0-8క్వింటాల వరకు క్వింటాకు రూ.28 నుంచి రూ.30 వరకు చెల్లించనున్నారు. ఈ ఏడాది రైతులకు ముందుగా సంచులను పంపిణీ చేయనున్నారు. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ చేసేందుకు ఎటువంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

తేమ సమస్యకు పరిష్కారం

తేమ శాతం సమస్యను అధిగమించేందుకు అధికారులు కొనుగోలు కేంద్రాల వద్ద, మిల్లుల వద్ద ఒకే రకమైన ఉపకరణాలను సిద్ధం చేశారు. వీటికి బ్లూటూత్‌ను అనుసంధానం చేశారు. తేమశాతం లెక్కించే సమయంలో బ్లూటూత్ ద్వారా జిల్లా, రాష్ట్ర కేంద్రాలకు సమాచారం వెళ్తుంది. రెండింటి మధ్య తేమ శాతంలో తేడా వస్తే తహసీల్దార్‌తో కూడిన కమిటీ పరిశీలించనుంది. అంతిమ నిర్ణయం కమిటీదే. ఇలా తేమ సమస్యకు ప్రభుత్వ పరిష్కారం చూపింది. తేమ శాతం తక్కువగా ఉంటే రైతులకు పూర్తిస్థాయిలో మద్దతు ధర లభించనుంది.

దోపిడీకి అడ్డుకట్టుపడేనా?

మిల్లర్లు తేమశాతం పరిశీలించిన తరువాత, ధాన్యంలో బియ్యం దిగుబడి ఎంత ఉందో పరీక్షలు(ఈలీంగ్) నిర్వహిస్తారు. బ్రోకన్ (నూకలు) రైస్ ఎక్కువగా ఉంటున్నాయని చెప్పి మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారు. బస్తాకు (80కేజీలు) మూడు నుంచి ఐదు కేజీల వరకు అదనంగా తీసుకుంటున్నారు. ఈఏడాది ఈ దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాలి. ఈ విషయాన్ని సివిల్ సప్లయ్ శాఖ డీఎం వేణుగోపాల్ వద్ద ప్రస్తావించగా.. 'ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం చేశాం. నిబంధనలు అతిక్రమించే మిల్లర్లపై చర్యలు తీసుకుంటాం. మిల్లుల వద్ద ధాన్యం దించేందుకు ఎలాంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచిస్తున్నాం' అని తెలిపారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఈ సేవలు వినియోగించుకుంటే లక్షల రూపాయలు ఆదా అవుతాయని తెలిపారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ అభయ ఐడీ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఐదు లక్షల ఉచిత బీమా సదుపాయం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్, డీఎంహెచ్‌వో కె.అనిత, ఆర్డీవో సాయి ప్రత్యూష, తహసీల్దార్ ఎం.గణపతి, ఎంపీడీవో వి.ప్రకాశ్‌రావు, పీహెచ్‌సీ వైద్యాధికారి టి.చిరంజీవినాయుడు, టీడీపీ నాయకులు మెండ దాసునాయుడు, అరవల రవీంద్ర, దుంగ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దగణగళ్లవానిపేటలో షెల్టర్ భవనం

పెద్దగణగళ్లవానిపేట తీరం సమీపంలో కేంద్రం నిధులు రూ.1.40కోట్లతో స్టోరేజ్ షెల్టర్ భవనం నిర్మాణానికి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి కోతకు గురైన సముద్ర తీర ప్రాంతాన్ని పరిశీలించారు. తీరం కోతకు గురవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో నిపుణులు ఇచ్చిన నివేదికను పరిశీలించారు. నది ప్రవాహ దిశ మారడం ప్రమాదకరమని, నేరుగా సముద్రంలో కలిసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కోతకు గురైన ప్రాంతానికి సమీపంలో మత్స్యకారుల వేటకు అనుగుణంగా ఫిషింగ్ జెట్టీ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పిల్లలు లేక పాఠశాల మూసివేత

కొత్తూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వీరనారాయణపురంలో విద్యార్థులు లేకపోవడంతో ఏకంగా పాఠశాలను విద్యాశాఖ అధికారులు మూసివేశారు. అక్కడి ఉపాధ్యాయినిని నివగాం పాఠశాలలో డెప్యుటేషన్‌పై నియమించారు. గతంలో ఉన్న విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలకు వెళుతుండటం వల్ల ఉపాధ్యాయిని ఖాళీగా ఉండాల్సి వస్తోంది. గ్రామంలో బడిఈడు పిల్లలు ఐదుగురే ఉన్నారు. వారు కూడా ప్రైవేటు పాఠశాల బాట పట్టారు. పాఠశాల నిర్వహించకపోవడంతో రూ.లక్షల విలువైన భవనాలు నిరుపయోగంగా మారాయి. ఇదే విషయమై మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా విద్యార్థులు లేకపోవడంతో ఉన్న ఉపాధ్యాయురాలిని నివిగాం పాఠశాలకు డెప్యుటేషన్‌పై పంపించామని చెప్పారు.


మూసివేసిన వీరనారాయణపురం పాఠశాల

కూర్మనాథ ఆలయం పరిశీలన



ఆలయాన్ని పరిశీలిస్తున్న పురావస్తు అధికారులు

గార, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలోని ప్రసిద్ధ శ్రీకూర్మనాథుని ఆలయాన్ని బుధవారం రాష్ట్ర పురావస్తు శాఖకు చెందిన అధికారులు, ఇంజనీర్ల బృందం పరిశీలించింది. ఈ క్షేత్రం అభివృద్ధికి ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఎమ్మెల్యే గొండు శంకర్ సూచనల మేరకు ఆలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. శతాబ్దాల కిందట నిర్మించిన ఆలయంలో శిల్పకళ ఉండటంతో పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.సురేష్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వెంకటరావు, పల్లంరాజు, ఇంజనీర్ బాస్కర్ నాయక్ పరిశీలించారు. ఆలయ ఈవో నరసింహ నాయుడు ఆలయ విశిష్టతను వివరించారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విపత్తుల నుంచి రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశాయని విమర్శించారు. మొంథా తుఫాన్ వల్ల రైతులు పంటలను నష్టపోతే రూ.5 వేల సామాన్యంగా పరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం అన్యాయం అన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవడంలో మోదీ సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. 2004లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు రుణమాఫీ చేసి ఆదుకుందని, ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాతి అని అన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ విజేత 'విశాఖ'

● ద్వితీయస్థానంలో శ్రీకాకుళం జట్టు



విజేత జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న డీఈవో రవిబాబు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్రస్థాయి పోటీల్లో భాగంగా స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో బుధవారం క్రికెట్ ఫైనల్ మ్యాచ్ జరిగింది. శ్రీకాకుళం, విశాఖపట్నం మధ్య జరిగిన ఈ ఫైనల్ పోటీల్లో విశాఖపట్నం జట్టు విజేతగా నిలిచింది. ఆతిథ్య జట్టు శ్రీకాకుళం ద్వితీయస్థానంలో నిలిచింది. ఫైనల్ పోటీ ఉత్కంఠభరితంగా సాగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విశాఖ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 74 పరుగులు చేసింది. శ్రీకాకుళం జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 74 పరుగులు చేయడంతో ఇరుజట్ల స్కోర్ లు సమమయ్యాయి. ఫలితం తేల్చేందుకు సూపర్ ఓవర్‌ను అంపైర్లు నిర్వహించడంతో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం జట్టు 7 పరుగులు చేయగా, తర్వాత విశాఖ జట్టు మూడు బంతుల్లో లక్ష్యాన్ని చేదించి విజేతగా నిలిచింది. విజేతలకు డీఈవో ఎ.రవిబాబు విజేతలకు జ్ఞాపిక, పతకాలు అందజేశారు. పోటీలకు రాష్ట్ర పరిశీలకుడిగా రాజేష్ గోల్, మ్యాచ్ నిర్వాహకులు పలువురు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలకు ఇన్వర్టర్ల బహూకరణ

లావేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తామాడ ఆదర్శ పాఠశాలకు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు రూ.50 వేలు విలువ చేసే రెండు ఇన్వర్టర్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు విద్యార్థులు చదువుకునేందుకు ఇది దోహద పడుతుందన్నారు. పోటీతత్వంతో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, తామాడ మాజీ సర్పంచ్, ఎచ్చెర్ల నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ కన్వీనర్ గొర్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.250 కోట్లతో 69 సబ్ స్టేషన్లు

● విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్



విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఆనకాపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలో గల 11 జిల్లాల్లో రూ.250 కోట్లతో 69 సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నట్టు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. బుధవారం ఆయన అనకాపల్లిలో రూ.5.5 కోట్లతో నిర్మించనున్న ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. కెకెపుపాడు మండలం చౌడువాడ, కింతలి గ్రామాల్లో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా చౌడువాడ గ్రామంలో మంత్రి మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అన్ని ప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం విధించిన ఎఫ్‌పీపీసీఏ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ ప్రైస్ అడ్జస్ట్‌మెంట్) చార్జీ (యూనిట్ టికి) 40 పైసల నుంచి 27 పైసలకు తగ్గించనున్నట్టు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకొని ప్రయోజనం పొందాలన్నారు. అనకాపల్లి జిల్లాలో ఇప్పటివరకూ 20 వేల మంది ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఇళ్లకు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు కొణతల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, కలెక్టర్ విజయకృష్ణన్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలపై సోలార్ ఏర్పాటు తప్పనిసరి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పాత శ్రీకాకుళం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని కేజీబీవీ భవనాలపై సోలార్ వ్యవస్థ ఏర్పాటు తప్పనిసరని, దీనికి సంబంధించి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీల మరమ్మతులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ యశోదలక్ష్మి మాట్లాడుతూ.. రూ. కోటి అంచనాలు సిద్ధం చేశామన్నారు. కోటబొమ్మాళి కేజీబీవీలో ప్రహరీ కూలిపోవడం, డ్రైనేజ్ సమస్యలపై కలెక్టర్ ఆరా తీసి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫ్లోరింగ్ సరిగా లేని చోట గ్రానైట్ వేయాలని సూచించారు. పిల్లల భద్రత కోసం అన్ని కేజీబీవీల భవనాల పైఅంతస్తులకు గేట్లు, తాళాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, డీఈవో రవిబాబు, ఎస్ఎస్ఏ ఏపీసీ శశిభూషణ్, ప్రిన్సిపాళ్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

జల్‌జీవన్ పనులు వేగవంతం చేయాలి

జల్‌జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. టెండర్ స్థాయిలో ఉన్న వాటిని సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఉద్దానం ప్రాంతానికి సంబంధించి అటవీ శాఖ వద్ద ఉన్న సమస్యను సంబంధిత అధికారులు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. ఎచ్చెర్ల మండలంలో స్థల సమస్య ఉందని ఎస్ఈ తక్షణమే పరిశీలించాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శంకర్‌బాబు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సోంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బుసాభద్ర పీడర్‌పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ జియజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మాకన్నపురం, పొత్రఖండ, బాతుపురం, హంసమెరక, ఎంకేపురం, బుఖడా, గొరుకుడుపాడు, చిన్నకొజ్జ, పెద్దకొజ్జ, అంబటికుంటారం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గుజరాతీపేట సబ్ స్టేషన్ పరిధిలో..

ఎచ్చెర్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గుజరాతీపేట 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ట్రీకట్టింగ్, మార్పు, నిర్వహణ నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గుజరాతీపేట, కుశాలపురం, కేశవరావుపేట, నవభారత్, తమ్మినాయుడుపేట, ససనవలసపేట, ఫరీదపేట, ఇబ్రహీంబాద్, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

హిరమండలం, ఎల్ఎన్‌పేటల్లో..

హిరమండలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హిరమండలం, ఎల్.ఎన్.పేట సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నరసింహ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆ ప్రకటనలో వివరించారు.

9న అండర్-12 క్రికెట్ ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ (పురుషుల) కళాశాలలో అండర్-12 క్రికెట్ జట్టుకు ఎంపికలను 9వ తేదీన నిర్వహించనున్నట్టు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్య దర్శులు పులిల శాస్త్రి, హసన్‌రాజా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు క్రికెట్ సంఘ భవనం పక్కన సెల్లర్‌లో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు పూర్తి డ్రెస్ కోడ్‌తో 9వ తేదీ ఉదయం 8.30 గంటలకు హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

మహిళా క్రికెట్ జట్టు స్ఫూర్తితో ఎదగాలి

● కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



అదనపు భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

పాత శ్రీకాకుళం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళా క్రికెట్ జట్టు స్ఫూర్తితో బాలికలు ముందుకు సాగాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. స్థానిక మహిళా కళాశాలలో కొవ్వాడ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ సీఎస్ఆర్ నిధులు రూ.99 లక్షలతో నిర్మించిన అదనపు భవనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన తల్లి చదివిన కళాశాల అని గత మీటింగ్‌లో బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటానని తెలిపానన్నారు. 1300 విద్యార్థినులు కలిగి రాష్ట్రం లో మూడో అతి పెద్ద కళాశాలగా కీర్తి పొందిందన్నారు. అయితే కళాశాలలో వసతులు లేకపోవడం తనను కలవరపరిచిందని, భవిష్యత్‌లో మరిన్ని భవనాలు నిర్మిస్తామని, గ్రౌండ్, వ్యాయామ ఉపాధ్యాయ కొరత త్వరలో తీరుస్తామన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలతో పాటు యువత విద్యా పరంగా పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థినులు ఇంటర్ తరువాత విద్యను కొనసాగించాలని, దీనికి తాను సహకారిస్తానని భరోసా ఇచ్చారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. కళాశాలలో భవనాల లోటును గమనించి కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం సాయంతో ఐదు గదులను నిర్మించారని, ల్యాబ్ మరో ఐదు అదనపు భవనాలు అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. విద్యా శాఖామంత్రి నారా లోకేశ్ చొరవతో ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీవో సాయి ప్రత్యూష, ఆంధ్రప్రదేశ్ విద్యా సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పీఎండీ బాబు, అణు విద్యుత్ కేంద్రం డైరెక్టర్ రవికుమార్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

● మానవత్వం చాటుకున్న ఏఎస్ఐ రామారావు

● 20 ఏళ్లుగా 64 శవాలకు కర్మకాండలు



రథంపై అనాథ మృతదేహాన్ని తీసుకు వెళ్తున్న ఏఎస్ఐ రామారావు

ఇచ్ఛాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మాన వత్వం చాటుకున్నారు కంచిలి ఏఎస్ఐ వెలుకల రామారావు. సుమారు 65 ఏళ్ల వయసున్న దుర్యాటి నారాయణ భిక్షాటన చేసుకుంటూ జీవించేవాడు. రాత్రిపూట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిద్రిస్తుండేవాడు. నాలుగు రోజుల కిందట తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. స్థానికులు గుర్తించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ విషయాన్ని ఇచ్ఛాపురం స్టేషన్‌లో అసిస్టెంట్ రైటర్ రవితేజ.. ఏఎస్ఐ రామారావుకు తెలిపారు. వెంటనే ఆయన బుధవారం ఆసుపత్రికి చేరుకుని శవాన్ని రథంపై బాహుదా నదికి తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. తాను కానిస్టేబుల్‌గా ఉన్న పుటి నుంచి అనాథలకు అంత్యక్రియలు నిర్వహించడం అలవాటు చేసుకున్నానని, ఇప్పటి వరకు 20 ఏళ్లగా 64 మంది అనాథలకు ఖననం సంస్కారాలు చేశానన్నారు. వృత్తిని కొడుకు మధ్యానికి బానిసై కాన్స్టేబుల్ కిందటే మృతి చెందాడని, కుమార్తె వివాహమై కోటబొమ్మాళిలో ఉంటుందని.. ఎవరూ పట్టించుకోకపోవడంతో వృత్తుడు భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్టు పట్టణ వాసులు తెలిపారన్నారు. ఈ విషయమై అతని కుమార్తె రమాపాత్రుని గీతకు ఫోన్ చేశామని, అయితే ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో డబ్బులు కూడా పంపి ఇవ్వాలని రప్పించినట్టు రామారావు తెలిపారు. అనాథలకు సేవ చేయడంలో తృప్తి ఉంటుందన్నారు.

చిరుధాన్యాలకు మార్కెట్‌లో గిరాకీ

ఆమదాలవలస, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిరు ధాన్యాలు, విలువ ఆధారిత ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న చిరుధాన్యాల సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిక్షణలో తెలుసుకున్న అంశాలను ఆచరణలో పెట్టి ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలన్నారు. వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ జ్యోతిబసు మాట్లాడుతూ.. మేజర్ మిల్లెట్స్ సాగు విధానం, వాటికి ఉన్న డిమాండ్‌ను వివరించారు. గృహవిజ్ఞాన శాస్త్రవేత్త బి.సునీత మాట్లాడుతూ చిరు ధాన్యాల పోషక విలువలు కలిగి ఉంటాయన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఎస్. కిరణ్‌కుమార్, డాక్టర్ జీఎస్ రాయ్, రైతులు, గ్రామీణ మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా గీతా మహాయజ్ఞం



గీతా యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

కవిటి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దూగానపుట్టుగ గీతామందిరంలో విశ్వశాంతి గీతా మహాయజ్ఞం బుధవారం ఘనంగా నిర్వహించారు. 24 గంటలపాటు ఈ కార్యక్రమం చేపట్టారు. మండసకు చెందిన సనాతన ధర్మప్రచారకర్త లోకనాథ్ పాణిగ్రాహి నేతృత్వంలో ఒడిశాకు చెందిన వేదపండితులు యజ్ఞం చేపట్టారు. అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు.

రెడ్డిక కులస్థుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి సవితకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నేత కొండా శంకర్ రెడ్డి

ఇచ్ఛాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని రెడ్డిక కులస్థుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర బీసీ రెడ్డిక సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిసి వినతిపత్రం అందజేశారు. పేదరికంలో ఉన్న రెడ్డిక కులస్థులకు 100 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా ఇవ్వాలని, పాడి రైతులకు ఆవులు, మేకలు, గొర్రెలు సబ్సిడీతో అందించాలని కోరారు. రెడ్డిక కులస్థులు ఉన్న మండలాల్లో కమ్యూనిటీ హాళ్లు మంజూరు చేయాలని కోరారు. వీటిని పరిష్కరించేందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్టు శంకర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టు మేనేజర్‌గా కిరణ్



కొట్టిన కిరణ్

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బీసీసీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు రాష్ట్ర మేనేజర్‌గా జిల్లాకు చెందిన కొట్టిన కిరణ్‌ను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నియమించింది. ఈ సందర్భంగా కిరణ్‌ను జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పులిల శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా, చీఫ్ మెంటార్ ఇలియాజ్ మహ్మద్, ట్రెజరర్ శైలని తదితరులు అభినందించారు.

న్యూస్ బాక్స్

అందుబాటులో రబీ విత్తనాలు

ఆమదాలవలస, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రబీ పంటలకు అవసరమైన విత్తనాలు రాయితీపై అందించేందుకు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏవో మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెసర 6.16 క్వింటాళ్లు, మినుములు 8.24 క్వింటాళ్లు, కట్టి జనుము 24.3 క్వింటాళ్లు ఉన్నాయన్నారు. ఈ విత్తనాలను ఆన్‌లైన్ పద్ధతిలో రైతులకు అందించనున్నామన్నారు.

మత్స్యకారులకు రేషన్ పంపిణీ

సోంపేట రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్‌లో నష్టపోయిన తీరప్రాంత గ్రామాల్లోని మత్స్యకార కుటుంబాలకు నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ అప్పలస్వామి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సూరాడ చంద్రమోహన్ తదితరులు ఒక్కో మత్స్యకార కుటుంబానికి 50 కిలోల బియ్యం, పంచదార, బంగాళదుంపలను అందజేశారు. మండలంలోని 9 రేషన్ డిపోల్లో 2874 కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేసినట్టు తహసీల్దార్ తెలిపారు. అలాగే చేనేత కార్మికుల కుటుంబాలకు పునరావాస కేంద్రంలో ఉన్న వారికి 25 కిలోల బియ్యం చొప్పున పంపిణీ చేశామన్నారు.

● ఇచ్ఛాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన మత్స్యకార కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర సరుకులను ఉచితంగా అందించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో బుధవారం పౌర సరఫరాల శాఖ డీటీ సంతోష్, కూటమి నాయకులు డొంకూరు, బుర్రుపాడు గ్రామాల్లో బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్షత డిల్లీరావు, టీడీపీ మండల అధ్యక్షుడు, కార్యదర్శులు లోపింటి పద్మనాభం, డికాఘిని, పీఏసీఎస్ అధ్యక్షుడు పెదిని బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఒడిశాలో రోడ్డు ప్రమాదం: జర్జంగి వాసి మృతి


విశ్వనాథం (ఫైల్)

కోటబొమ్మాళి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం బలంగీర్‌కు సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జర్జంగి గ్రామానికి చెందిన మునగవలస విశ్వనాథం (45) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు విశ్వనాథం లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. బలంగీర్‌కు సమీపంలో సోమవారం అర్ధరాత్రి రెండు లారీలు ఢీకొనడంతో విశ్వనాథం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని బుధవారం ఉదయం స్వగ్రామం జర్జంగి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో కుటుంబం రోడ్డున పడిందని బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

కారు ఢీకొని మోటార్ సైక్లిస్టుకు గాయాలు


చికిత్స పొందుతున్న సోమేశ్వరరావు

పాతపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం-తెంబూరు రోడ్డులో ప్రహరాజపాలెం చేరువలో బుధవారం కారు ఢీకొని మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలివీ.. పాతపట్నం నుంచి కొత్తపల్లిలో ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు కారులో వెళుతున్న లక్కోజు లక్ష్మణరావు అనే వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగి... పెద్దలోగిడి నుంచి పాతపట్నం వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న లంక సోమశేఖర్ అలియాస్ సోమేశ్వరరావు అనే విశ్రాంత సీఆర్‌పీఎఫ్ ఉద్యోగిని ఢీకొన్నారు. దీంతో సోమశేఖర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. లక్ష్మణరావు మద్యం తాగి.. అతి వేగంగా కారు నడుపుతూ... రోడ్డు పక్కన ఉన్న గుంతను తప్పించబోయి ద్విచక్ర వాహనదారుని ఢీకొన్నాడని పోలీసులు తెలిపారు. బాధితుడిని చికిత్స కోసం పాతపట్నం సామాజిక ఆస్పత్రికి పోలీసులు తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. బాధితుని ఫిర్యాదుతో ఏఎస్‌ఐ కె.శ్రీరామ్మూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ లీకేజీ.. త్రుటిలో తప్పిన ప్రమాదం


రోడ్డుపై గుమిగూడిన స్థానికులు. వృత్తంలో గ్యాస్ సిలిండర్

పలాస, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఇంటిలో పిండివంటలు చేస్తుండగా గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించాయి. ఆ ధాటికి ఇంటిలో ఉన్న వస్తు సామగ్రి, గృహాలంకరణ వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. అగ్నిమాపకశాఖ సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానిక అన్నపూర్ణ ఆశ్రమం వీధిలో బుధవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీలో నివాసం ఉంటున్న గిన్ని సింహాచలం ఇంట్లో కార్తీక స్టవ్‌ను కిందకు దించి పిండివంటలు చేస్తున్నారు. ఈ క్రమంలో చిన్నమంటలు సిలిండర్ నుంచి వచ్చాయి. అదుపు చేసే ప్రయత్నం చేయగా మంటలు పెద్దవి కావడంతో అంతా పరుగులు తీశారు. క్షణాల్లో వస్తు సామగ్రి కాలి బూడిదయింది. అగ్నిమాపకశాఖ సిబ్బంది చేరుకున్నా ఆ ప్రాంతానికి వెళ్లడానికి దారి లేకపోవడంతో అతికష్టంపై ఫోమ్, ఇతర సామ గ్రి తీసుకువెళ్లి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే నష్టం జరిగిపోయింది.

గంజాయి కేసులో మరో ఇద్దరి అరెస్టు

రణస్థలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో మరో ఇద్దరు వ్యక్తులను బుధవారం జేఆర్‌పురం పోలీసులు అరెస్టు చేశారు. జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం తెలిపిన వివరాల మేరకు ఆగస్టులో గంజాయి కేసులో పలువురిని అరెస్టు చేశారు. ఆ కేసులో విజయవాడలో ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న ఎస్‌కే షరీఫ్, కమ్మిశెట్టి వినోద్ కుమార్‌లకు సంబంధం ఉన్నట్టు పోలీసులు గుర్తించి, తాజాగా వారిని అరెస్టు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ

హరిపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కమలాపురం గ్రామంలో వ్యవసాయ బోర్లుకు వినియోగిస్తున్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు, ఇతర పరికరాలు చోరీకి గురయ్యాయి. రైతులు బుధవారం పొలాలకు వెళ్లి చూడగా.. గట్లుపై ట్రాన్స్‌ఫార్మర్ విడిభాగాలు పడి ఉన్నాయి. దీంతో రైతులు ట్రాన్స్‌కో అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతులు బావన కృష్ణమోహన్, సీమయ్య, చమళ్ల చక్రధర్, సీపాన చిరంజీవులు పొలాల్లో వ్యవసాయ బోర్లు ఏర్పాటు చేసుకున్నారు. వీటికి విద్యుత్తు సరఫరా కోసం జాతీయ రహదారి పక్కనే ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌కు వచ్చే విద్యుత్తు సరఫరా నిలుపుదల చేసి రాగివైరు, ఆయిల్, ఇతర ఖరీదైన పరికరాలను దొంగలు ఎత్తుకుపోయారు. గతంలో ఇదే ప్రాంతంలో ఒక ట్రాన్స్‌ఫార్మర్ చోరీ చేయగా.. ఇది రెండోదని రైతులు లబోదిబోమంటున్నారు.

ఫర్నీచర్ వర్క్‌షాపులో...

వజ్రపుకొత్తూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెదరాజాంలోని ఫర్నీచర్ వర్క్‌షాపులో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. వివిధ పనిముట్లు, మిషన్లు, చిన్న ట్రాక్టర్ ఇంజన్ తదితర సామాన్లు చోరీకి గురైనట్లు యజమానులు చెబుతున్నారు. వీటి విలువ సుమారు రూ.5 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ బి.నిహార్ చెప్పారు.

ఇనుప స్తంభాలు...

పలాస/రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురం వద్ద ఉన్న సత్యసాయి విద్యావిహార్‌కు చెందిన రూ.30 వేల విలువైన 12 ఇనుప స్తంభాలు చోరీకి గురైనట్టు సంస్థ చైర్మన్ మల్లా రామేశ్వరరావు కాశీబుగ్గ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పాఠశాల చుట్టూ ఇటీవల మొత్తం 60 స్తంభాలు పాతామని అవి చోరీకి గురయ్యాయని తెలిపారు. ఎస్‌ఐ కె.నర్సింహమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడిన మహిళల అరెస్టు

జి.సిగడాం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాడుబడిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు మహిళలను అరెస్టు చేసినట్టు జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళలను గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. వీరిని సీఐ అవతారం విచారించగా ఒక దొంగతనం వెలుగు చూసింది. ఉదయం 11 గంటల సమయంలో బలిజ వీధిలో పెద్ద గోనె సంచులు పట్టుకొని తిరుగుతున్న ముగ్గురు మహిళలను ప్రజలు గుర్తించారు. అదే సమయంలో గ్రామానికి చెందిన వెలిది నాగరాజుకు చెందిన పాడుపడిన పెంకుటింట్లో ఉన్న పాత కంచు సామాన్లు గల్లంతైనట్లు ఫిర్యాదు చేయడంతో అనుమానితులైన జగన్నాథం కృపావతి, సంతోషి, దాసరి లక్ష్మిలను విచారించామన్నారు. వీరు విజయనగరం జిల్లా అయ్యన్నపేట నల్లమారమ్మ దేవాలయ సమీప ప్రాంతానికి చెందినవారని విచారణలో వెల్లడైందన్నారు. ఉత్సవాలు, జాతర్లలో బూరలు, ప్లాస్టిక్ బొమ్మలు అమ్మడం, గ్రామాల్లో తల వెంట్రుకలు కొనుగోలు చేసినట్లు నటించడం, పాడుబడిన ఇళ్లలో ఇనుప సామాన్లు, పాడై ఉన్న వస్తువులు దొంగతనం చేయడం వీరి వృత్తిగా రుజువైందన్నారు. ముగ్గురు మహిళలపై కేసు నమోదైంది.

వంశధారలో బాలియాత్రకు శ్రీకారం


జలుమూరు: బాలియాత్రను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు


కోటబొమ్మాళి: బాలియాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అయ్యప్ప భక్తులు

జలుమూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న శ్రీముఖలింగం సమీపంలో వంశధార నదిలో చేపట్టనున్న బాలి యాత్ర దీపారాధన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని వంశధార నదిలో దీపారాధన చేశారు. తెప్పలు విడచిపెట్టి బాలియాత్రను ప్రారంభించారు. అనంతరం వంశధార నదికి కుంభ హారతిని అందించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టి.సతీష్ కుమార్, ఎంపీటీసీ కరుకోల హరిప్రసాద్, కమిటీ సభ్యులు డి.జీవితేజేశ్వరరావు, బొడ్డేపల్లి శ్రీరామచంద్రమూర్తి, నేతాజీరావు, ఎస్.వెంకటాచలం, జనార్దనరావు, మొజ్జాడ రామారావు, సూర బాలకృష్ణ, కొత్తకోట శ్రీనివాసరావు, పలువురు అర్చకులు పాల్గొన్నారు.

పటిష్ఠ బందోబస్తు ...

శ్రీముఖలింగంలో ఈనెల 9న నిర్వహిస్తున్న బాలియాత్ర సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నరసన్నపేట సీ.ఐ. ఎం.శ్రీనివాసరావు తెలిపారు. వంశధార నదిలో తెప్పలు విడచిపెట్టే ప్రాంతాన్ని, ఆలయాన్ని బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంశధార నదిలో అరటి తెప్పలు విడచిపెట్టే ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులు నదిలోనికి వెళ్లకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నదికి వెళ్లే మార్గంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ పరిశీలనలో ఎస్.ఐ బి.అశోక్‌బాబు, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, సర్పంచ్ సతీష్, ఎంపీటీసీ సభ్యుడు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కోటబొమ్మాళి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కళింగ సామ్రాజ్య చారిత్రక వైభవాన్ని చాటి చెప్పే బాలి యాత్రలో అందరూ పాల్గొని విజయవతం చేయాలని నిర్వాహక కమిటీ సభ్యులు ఎల్.కరుణాకర్ పిలుపునిచ్చారు. బుధవారం బాలి యాత్ర ఆహ్వాన పత్రికను స్థానిక కొత్తమ్మతల్లి ఆలయంలో అయ్యప్ప స్వాములతో కలిసి ఆవిష్కరించారు. ఈనెల 9న శ్రీముఖలింగంలోని మధుకేశ్వరస్వామి సన్నిధిలో... వంశధార నదీ తతీరంలో బాలి యాత్ర జరుగుతుందని తెలిపారు. ప్రపంచానికి నౌకా వర్తకాన్ని పరిచయం చేసిన కళింగ ప్రాంత పూర్వీకుల వైభవాన్ని చాటి చెప్పాలని ఈ యాత్ర చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వాములు ధూపాన రామణారెడ్డి, కమ్మకట్టు శ్రీనివాసరెడ్డి, నౌపడ మురళీధరరావు పట్నాయక్, మెట్ట కాళేశ్వరరావు, మెట్ట సింహాచలం, జనార్దన గురుభవాని తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో భక్తుల సందడి


ఆలయం వద్ద పూజలు చేయిస్తున్న భక్తులు

జలుమూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలో గల శ్రీముఖలింగేశ్వర స్వామిని బుధవారం భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి భక్తులు చేరుకోవడంతో శ్రీముఖలింగం కిటకిటలాడింది. స్వామి వారి సన్నిధిలో పలువురు మహిళలు కేదారేశ్వర స్వామికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. ఎస్.ఐ. బి.అశోక్ బాబు ముందు జాగ్రత్త చర్యగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థుల్లో చైతన్యం కోసమే 'సంకల్పం'



మాట్లాడుతున్న సీఐ తిరుపతిరావు

హరిపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో చైతన్యం కోసమే ప్రభుత్వం 'సంకల్పం' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు అన్నారు. స్థానిక నారాయణ హైస్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సంకల్పం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో పాటించాల్సిన క్రమశిక్షణ, లక్ష్యసాధన కోసం సూచనలు చేశారు. ఎస్‌ఐ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ డ్రగ్స్, మత్తు పదార్థాలతో జీవితాలు నాశనమైపోతున్నాయని.. అటువైపు వెళ్లకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ వెంకటేష్, డైరెక్టర్ రోహిణీ శంకర్, అరవింద్, బుద్ధ సూర్య తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యాకోర్సులతో స్వయం ప్రతిపత్తి


విద్యార్థులతో ప్రిన్సిపాల్, కమిటీ సభ్యులు

పాతపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వృత్తివిద్యా కోర్సులతోనే స్వయం ప్రతిపత్తి సాధించగలుగుతారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.హేమసుందరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓజేటీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 27 వరకూ జరగనున్న ఈ శిక్షణతో విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో వివిధ కార్యాలయాలలో ఉద్యోగుల విధి నిర్వహణ తీరుపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా త్రిసభ్య కమిటీ సభ్యుడు బీటీవీ మంగపతి, ఓజేటీ నిర్వాహకులు ఎస్.కేశవరావు ఎ.రాజకుమారి ఎ.వి. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

మెళియాపుట్టి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని స్థానిక పీఏసీఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు అన్నారు. బుధవారం కేరాసింగిగూడ గిరిజన గ్రామంలో స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్యకరమైన స్థితికి తీసుకువెళ్లాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ తీసుకువచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు నంబాల వెంకటరావు, గిరిజన సంఘ నాయకులు భైరిసింగి దినకర్, తెలుగు యువత అధ్యక్షులు పరమేష్ రెడ్డి, ఎంపీటీసీ ప్రతినిధి డాక్టర్ రాజు తదితరలు పాల్గొన్నారు.

'మార్క్యుసెమీ'తో సెంచూరియన్ ఒప్పందం

ఒడిశా


వివరాలు వెల్లడిస్తున్న డీఎన్‌రావు, సుప్రియా పట్నాయక్, ఉమేష్ మహంతి తదితరులు

పర్లాకిమిడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రంలో గల సెంచూరియన్ యూనివర్సిటీ అదే రాష్ట్రంలోని బౌద్ధ్ నగర్‌లో ఉన్న మార్క్యుసెమీ మరియే సిగ్నేచర్ ఐపీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు బుధవారం మాట్లాడుతూ ఈ ఒప్పందం వల్ల విద్యార్థులకు వాస్తవ ప్రపంచ సెమీ కండక్టర్ అనుభవం, పరిశ్రమ స్థాయి సాధనాలతో హ్యాండ్స్ ఆన్ శిక్షణ, డొమైన్ నిపుణుల మార్గదర్శకత్వాన్ని అందిస్తాయన్నారు. పరిశోధన, శిక్షణ, నైపుణ్య అభివృద్ధి, పరిశ్రమ మార్గదర్శకత్వం కోసం సమగ్ర కేంద్రంగా పని చేయడానికి ఈ ఒప్పందం దోహద పడుతుందన్నారు. వైస్‌చాన్సలర్ సుప్రియా పట్నాయక్ మాట్లాడుతూ స్కేలబుల్ సిలికాన్ సిస్టమ్ కోసం నూతన సాంకేతిక ఆవిష్కరణకు పరిశ్రమ అనుసంధానిత విద్యా ప్రయాణంలో మైలురాయిగా ఒప్పందాన్ని అభివర్ణించారు. మార్క్యుసెమీ-సిగ్నేచర్ ఐపీ సంస్థ ప్రతినిధి ఉమేష్ మహంతి మాట్లాడుతూ భారతదేశపు సెమీ కండక్టర్ మిషన్, గ్లోబల్ పోటీ సామర్థ్యానికి తోడ్పడగల నైపుణ్యత కలిగిన ఇంజనీర్లను తయారు చేయడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

పర్లాకిమిడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) కార్తీక పౌర్ణమి పూజలను బుధవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే మహేంద్రతనయ నదిలో పర్లాకిమిడి వాసులు స్నానమాచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్ని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం ఆలయాల వద్ద దీపారాధన చేశారు.

ఘనంగా ఆలయ శిఖర ప్రతిష్ఠ

సంతబొమ్మాళి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళిలో సూర్య దేవాలయ శిఖర ధాన్య ప్రతిష్ఠ బుధవారం ఘనంగా జరిగింది. శ్రీ సూర్య మారుతి సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో రూ.60లక్షల అంచనా వ్యయంలో సూర్య దేవాలయం నిర్మిస్తున్నారు. కార్తీక పౌర్ణమి రోజు దేవాలయ శిఖర ధాన్య కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు నిధుల మంజూరు

ఎల్.ఎన్.పేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని టీడీపీ నాయకులు తెలిపారు. ముంగెన్నపాడు జంక్షన్ నుంచి గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.68 లక్షలు మంజూరయ్యాయి. జాడుపేట నుంచి బిడ్డికపేట వరకు రూ.కోటి, బిడ్డికపేట నుంచి గార్లపాడు వరకు రూ.50 లక్షలు, చిన్నకొల్లివస నుంచి కొమ్ముపలస వరకు రోడ్డు నిర్మాణానికి రూ.కోటి మంజూరయ్యాయి. ఏబీ రోడ్డు నుంచి చిన్నకొల్లివలస వరకు రూ.50లక్షలు, ఎఫ్‌డిపేట జంక్షన్ నుంచి జాడుపేట వరకు రోడ్డుకు రూ.కోటి, బసవరాజుపేట నుంచి పెద్దకోట ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు రూ.కోటి, కొమ్మువలస నుంచి గొట్టిపల్లి వరకు రోడ్డుకు రూ.50 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. రోడ్లకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మోహనరావు, కె.చిరంజీవి, నాయకులు వి.గోవిందరావు, ఎస్.తేజేశ్వరరావు, వి.ఆనందరావు, కె.మన్మథరావు, సీహెచ్. శ్రీనివాసరావు, బి.గోపాలరావు, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక భవనం ప్రారంభం

వజ్రపుకొత్తూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చినవంక గ్రామంలో స్థానిక యువత ముందుకు వచ్చి దాతల సాయంతో సామాజిక భవన నిర్మాణం చేపట్టారు. దీని కోసం రూ.8 లక్షలు వెచ్చించారు. గ్రామంలో పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలకు కల్యాణ మండపాలు బుక్ చేసుకొనే స్తోమత లేనివారు ఈ భవనం ఉపయోగించుకోవచ్చని చెప్పారు. యువత శ్రమదానం చేయడంతో తక్కువ ఖర్చుతో నిర్మించినట్లు తెలిపారు. బుధవారం భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, నాయకులు ఉదయకుమార్, దువ్వాడ హేంబాబుచౌదరి, కొయిరి ఢిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

కోటబొమ్మాళి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వైజాగ్ రాజీవ్ ఇండోర్‌స్టేడియంలో చోటుఖాన్ స్పోర్ట్స్ కరాటే డు అసోసియేషన్ ఆధ్వర్యంలో చీఫ్‌ఆర్గనైజర్ జి.ఎస్.మూర్తి నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో కోటబొమ్మాళికి చెందిన విద్యార్థులు పతకాలు సాధించారని మాస్టర్ దుర్గారావు బుధవారం తెలిపారు. తమ విద్యార్థులు మనోజ్‌కుమార్ రెడ్డి కుమిటి విభాగంలో వెండి పతకం, కటా విభాగంలో కాంస్యం, తేజేశ్వర్, హేమస్వరూప్‌లకు కటా విభాగంలో కాంస్య పతకాలు లభించాయని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కోటబొమ్మాళి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ, బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బూరే నరేంద్ర చక్రవర్తి కోరారు. బుధవారం బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మెట్ట తిరుమలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల ప్రవాసి యోజన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులందరూ కలిసి అంకితభావంతో పని చేయాలన్నారు. అనంతరం మండల, బూతు కమిటీలు, శక్తి కేంద్ర ప్రముఖుల కమిటీలపై పార్టీ నాయకులతో చర్చించారు. స్థానిక ఎన్నికలలో పోటీ చేసే యోచన ఉన్న అభ్యర్థుల పేర్లు సేకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దివాకర్, మెట్ట మన్మథరావు, దుంపల ఉమామహేశ్వరరావు, లక్ష్మణరావు, గోవిందరావు, మాధవరావు, నరసింహమప్పుడు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.10 కోట్లు

పాతపట్నంరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పాతపట్నం నియోజకవర్గంలో వివిధ పనులకు రూ.పది కోట్లు మంజూరయ్యాయని సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని కొరికాన కాంపిటేటివ్ అకాడమీలో జనసేన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి నిధులను తీసుకువచ్చామని తెలిపారు. సుడా నిధులు సైతం కేటాయిస్తామన్నారు.

దయచేసి వినండి..
ఈ అక్షరాలు అర్థం కావడం లేదు



వృత్తంలో ఉన్న జరిమానా సంఖ్య

పలాస, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పలాస రైల్వే స్టేషన్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన 'చెత్త వేయకూడదు' అనే హెచ్చరిక బోర్డులు అయోమయానికి గురిచేస్తున్నాయి. వీటిని తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో ముద్రించారు. తెలుగులో ఉన్న 'జరిమానా' అక్షరాలు బాగానే ఉన్నా... అపరాధ రుసం సంఖ్య అయోమయానికి గురిచేస్తోంది. మిగిలిన భాషల్లో ఉన్న అక్షరాలను బట్టి ఆ సంఖ్యను పోల్చాల్సి వస్తోంది. దీనిపై రైల్వే అధికారులు స్పందించి జరిమానా రూ.200 అని రాయిస్తే... ఈ ప్రాంత ప్రయాణికులకు సులభంగా అర్థమవుతుంది.

జాగ్రత్తలు పాటించండి


నిర్వాహకులతో మాట్లాడుతున్న పోలీసులు

హిరమండలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హిరమండలం మేజర్ పంచాయతీలో ఉన్న శ్రీ జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 7న ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఈ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని కొత్తూరు సీఐ చింతాడ ప్రసాదరావు చెప్పారు. బుధవారం స్థానిక తహసిల్దారు జోగారావు, ఎస్‌ఐ వెంకటేష్‌తో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు.

ఆంక్షల నడుమ సముద్ర స్నానాలు

పోలాకి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మహిళలు ఉపవాసాలు, నోములు చేశారు. సాయంత్రం పోలీసుల ఆంక్షల నడుమ సాగరంలో స్నానాలు చేశారు. అనంతరం ఆలయాల్లో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. పల్లిపేట, వనిత మండలం, డోల గ్రామాల పరిధిలోని భక్తులు వంశధార నదిలో పుణ్యస్నానాలు చేశారు.

ఉచిత సరుకుల్లో పంచదారకు కోత

పోలాకి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ బాధిత మత్స్యకారులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన నిత్యావసర సరకుల్లో నూనె, పంచదారకు కోత విధించినట్టు సంబంధిత గ్రామాల వినియోగదారులు చెబుతున్నారు. బుధవారం సాయంత్రం రాజారాంపురంలో కొందరు లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు అరలీటరు వంతున నూనె ఇచ్చారని.. పంచదార సరఫరా కాలేదని తెలిపారు. ఈ విషయాన్ని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి సమస్య పరిష్కరింపజేస్తానని తెలిపారు.

చెత్త వేస్తే రూ.వెయ్యి జరిమానా

జలుమూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) జనవాసాల వద్ద, రోడ్డు పక్కన చెత్తవేస్తే రూ.వెయ్యి జరిమానా విధించనున్నట్టు ఎంపీడీవో బి.చిన్నమ్మడు తెలిపారు. చల్లవానిపేట, లింగాలవలస గ్రామ పంచాయతీలకు సంబంధించి గుంజుమెట్ట వద్ద వేసిన చెత్తను తొలగించి బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డుపక్కన చెత్తవేస్తే జరిమానాతో పాటు శిక్షార్హులవుతారని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చల్లవానిపేట పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డెల్ఫి టీవీఎస్‌కు 117 మంది విద్యార్థులు

టెక్కలి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో డెల్ఫి టీవీఎస్ ఆటోమొబైల్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 117మంది విద్యార్థులు ఎంపికయ్యారని డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. ఎంపికైన వారిలో బీటెక్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విభాగాల విద్యార్థులతో పాటు 58మంది డిప్లొమా విద్యార్థులు కూడా ఉన్నారని తెలిపారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.3 లక్షల ప్రారంభ వార్షిక వేతనం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డీన్ ప్లేస్‌మెంట్ డాక్టర్ సంతోష్‌కుమార్, ప్లేస్‌మెంట్ హెడ్ డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.